EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com

4PM

www.suryaa.com

సోమవారం

02-03-2026

పేజీలు: 02







# బోణీ కొట్టని గుకేశ్

ప్రేగ్ ఇంటర్నేషనల్ చెస్ మాస్టర్స్‌లో తొలి విజయం కోసం వేచిచూస్తున్న వరల్డ్ చాంపియన్ డి. గుకేశ్‌కు నాలుగో రౌండ్‌లోనే నిరాశే ఎదురైంది. నాలుగో రౌండ్‌లో అతడు.. డేవిడ్ నవారా (చెక్ రిపబ్లిక్)తో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. తొమ్మిది రౌండ్లుగా జరుగబోయే ఈ టోర్నీలో జోర్డెన్ (హాలండ్) నాలుగు గేమ్‌ల్లో మూడు గెలిచి 3 పాయింట్లతో అగ్రస్థానాన కొనసాగుతున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ అరవింద్ చిదంబరం నాలుగో రౌండ్‌లో విన్సెంట్ కీమర్ (జర్మనీ) చేతిలో ఓడిపోయాడు.



# సంజూ క్లాస్ ఇన్నింగ్స్

టీ20 ప్రపంచకప్‌లో సంజూ శాంసన్ అసాధారణ పోరాటంతో అదరగొట్టాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా జరిగిన అత్యంత కీలకమైన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 196 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో మొదటి బంతి నుంచి చివరి వరకు క్రీజులో ఉండి, 97 పరుగులతో అజేయంగా నిలిచాడు. తన వీరోచిత ఇన్నింగ్స్‌తో టీమిండియాను ఒంటిచేత్తో గెలిపించి సెమీఫైనల్ బెర్తును ఖాయం చేశాడు. పెద్దగా అంచనాలు లేకుండా బరిలోకి దిగిన శాంసన్, ఆరంభం నుంచే బాధ్యతాయుతమైన ఆటతీరు కనబరిచాడు. లక్ష్య ఛేదనలో ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం ఒత్తిడికి లోనుకాలేదు. నిలకడగా ఆడుతూనే, అవసరమైనప్పుడు అద్భుతమైన షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. చివరి వరకు క్రీజులో పాతుకుపోయి విజయ లాంఛనాన్ని పూర్తి చేయడం ద్వారా తన క్లాస్‌ను, తెగువను ప్రదర్శించాడు. ఈ గెలుపుతో భారత్ సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది.



# పూజా హెగ్డే ఆసక్తికర పోస్ట్

ప్రముఖ సినీ తార పూజా హెగ్డే సోషల్ మీడియా వేదికగా తన తల్లిదండ్రులకు పెళ్లి రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక ఆసక్తికరమైన 'త్రోబ్యాక్' ఫొటోను పంచుకున్నారు. అందులో పూజా తల్లిదండ్రులు ఒకే గ్లాసులో నుంచి రెండు స్ట్రాలతో జ్యూస్ తాగుతుండగా, చిన్నారి పూజా కూడా స్టైల్ గా అలాగే తాగుతూ కనిపించారు. ఈ ఫొటోను షేర్ చేస్తూ.. "ఆపిల్ పండు చెట్టుకు మరీ దూరంగా పడదు (పిల్లలకు తల్లిదండ్రుల పోలికలే వస్తాయి)" అనే అర్థం వచ్చేలా క్యాప్షన్ ఇచ్చారు. "హ్యాపీ యానివర్సరీ మామ్ అండ్ డాడ్.. లవ్ యూ ఆల్" అంటూ రెడ్ హార్ట్ ఎమోజీని జతచేశారు. కాగా, పూజా తండ్రి మంజునాథ్ హెగ్డే క్రిమినల్ లాయర్ కాగా, తల్లి లతా హెగ్డే ఇమ్యూనాలజిస్ట్ మరియు వ్యాపారవేత్తగా రాణిస్తున్నారు. ఆమె సోదరుడు రిషబ్ ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. ఇక తన వ్యక్తిగత, వృత్తిపరమైన విషయాలను ఎప్పటికప్పుడు అభిమానులతో పంచుకునే పూజా.. తాను తిరిగి షూటింగ్ మోడ్‌లోకి వచ్చినట్లు తెలిపారు. వెకేషన్ ముగించుకుని తిరిగొచ్చిన ఆమె, వ్యానిటీ వ్యాన్ నుంచి మిర్రర్ సెల్ఫీని పోస్ట్ చేస్తూ "బ్యాక్ హోమ్ అండ్ బ్యాక్ టు షూట్" అని పేర్కొన్నారు. వెల్లడించలేదు.



# ఏపీ టీచర్లకు కొత్త అటెండెన్స్ రూల్స్.. ఇక నిమిషం ఆలస్యమైనా 'లేట్'

ఏపీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయుల హాజరుకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కొత్త, కఠినమైన నిబంధనలను అమల్లోకి తెచ్చింది. క్రమశిక్షణ, సమయపాలనను మెరుగుపరిచే లక్ష్యంతో ఈ మార్గదర్శకాలను జారీ చేసింది. ఇకపై ఉపాధ్యాయులు ప్రతిరోజూ ఉదయం 9 గంటలలోపు పాఠశాలలకు తప్పనిసరిగా చేరుకోవాలని స్పష్టం చేసింది. ఆ సమయం తర్వాత హాజరు నమోదు చేస్తే దానిని 'లేట్ ఇన్'గా పరిగణిస్తారు. కొత్త నిబంధనల ప్రకారం నెలలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే 10 నిమిషాల గ్రేస్ పీరియడ్ (వెసులుబాటు సమయం) ఉంటుంది. ఇక హాఫ్-డే సెలవు తీసుకునే వారికి కూడా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఉదయం సెలవు పెట్టి మధ్యాహ్నం విధులకు హాజరయ్యేవారు ఒంటి గంట లోపు హాజరు నమోదు చేయాలి. ఆ తర్వాత వస్తే 'లేట్ ఇన్'గా లెక్కిస్తారు. అలాగే ఉదయం విధులకు హాజరై మధ్యాహ్నం సెలవు పెట్టేవారు 12:30 గంటల కంటే ముందు 'ఔట్ టైమ్' నమోదు చేయకూడదు. పాఠశాల ముగిసే సమయానికి సంబంధించి కూడా నిబంధనలను కఠినతరం చేశారు. ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు సాయంత్రం 3:30 గంటల కంటే ఒక్క నిమిషం ముందు ఔట్ టైమ్ నమోదు చేసినా, ఉన్నత పాఠశాలల టీచర్లు సాయంత్రం 4 గంటల కంటే ముందు నమోదు చేసినా దానిని 'ఎర్లీ ఔట్'గా పరిగణిస్తారు. ముఖ్యంగా ఉదయం ఇన్-టైమ్ నమోదు చేసి, సాయంత్రం ఔట్-టైమ్ నమోదు చేయడం మరిచిపోతే, వారు ఆ రోజంతా గైర్హాజరైనట్లే లెక్క. అంటే ఉదయం వచ్చిన వెంటనే వెళ్లిపోయినట్లుగా భావిస్తారు.




# మంచిర్యాలలో బీసీ బాలుర హాస్టల్ విద్యార్థుల ఆందోళన

'తమకు సరిపడా తిండి పెట్టడం లేదు. పనులన్నీ మాతోనే చేయిస్తున్నరు' అంటూ ఆదివారం ఉదయం మంచిర్యాలలోని సాయికుంట ప్రభుత్వ బీసీ సమీకృత బాలుర వసతిగృహంలో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా అఖిల భారత విద్యార్థి బ్లాక్ (ఏఐఎస్‌బీ)జిల్లా ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల సన్నీగౌడ్ మాట్లాడుతూ.. హాస్టల్ సిబ్బంది విద్యార్థులతో ఉదయం ఐదు గంటల నుంచే పనులు చేయిస్తున్నారని, అల్పాహారం తయారీ మొదలుకొని, స్టోర్‌నుంచి బియ్యాన్ని వంటగదికి మోసుకెళ్లడం, కూరగాయలను తరిగించడం లాంటి పనులు ఎన్నో చేయిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు సరిపడా భోజనం పెట్టకపోవడంతో పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తంచేశారు. హాస్టల్ ఆవరణ అంతా అపరిశుభ్రంగా ఉందని, తలుపులు సరిగా లేవని, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేరని మండిపడ్డారు.

## లైసెన్స్ లేకుండా దొరికితే బండి సీజ్

# ట్రాఫిక్ పోలీసుల హెచ్చరిక



హైదరాబాద్ వాహనదారులకు అలర్ట్. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మీ వెహికల్ బయటకు తీశారా.. ఇక అంతే సంగతులు. మీ బైక్ లేదా కార్ సీజ్ కావటం ఖాయం. ఎందుకంటే హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో లైసెన్స్ లేకుండా వెహికల్స్ నడిపే వారిపై కఠిన చర్యలకు రంగం సిద్ధమైంది. నేటి (మార్చి 1) నుంచి నగర పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నారు. ఎవరైనా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వెహికల్ నడిపితే వారి వాహనం సీజ్ చేయనున్నారు. అనంతరం వారికి స్పెషల్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. డ్రైవింగ్ లైసెన్స్, ఎల్‌ఎల్‌ఆర్ తీసుకునేందుకు తగినంత సమయం కూడా ఇస్తారు. తర్వాత కోర్టులో ఫైన్ చెల్లించి వాహనం తీసుకెళ్లవచ్చు. లైసెన్స్ లేని వారికి వాహనాలు ఇచ్చే యజమానులపైనా కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ జాయింట్ సీపీ హెచ్చరించారు. వాహనదారులు విధిగా డ్రైవింగ్ లైసెన్స్ దగ్గర పెట్టుకోవాలని సూచించారు. లేదంటే వాహనాలు సీజ్, ఫైన్ వంటివి ఎదుర్కోవాల్సి ఉంటుందని వార్నింగ్ ఇస్తున్నారు. ఇదిలా ఉండగా.. తెలంగాణలో కొత్తగా వాహనాలు కొనుగోలు చేసే వారికి నేటి నుంచి (మార్చి 1) అదనపు భారం పడనుంది. రాష్ట్రంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి, రహదారి భద్రతా చర్యలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం 'రోడ్డు సేఫ్టీ సెస్' పేరుతో కొత్త పన్నును అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు రవాణా శాఖ ఇప్పటికే అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం ద్విచక్ర వాహనాలు కొత్తగా కొనుగోలు చేస్తే రూ. 2 వేలు అదనంగా చెల్లించాలి. ఫోర్ వీలర్లు రూ. 5వేలు, భారీవాహనాలు, ప్రైవేట్ వాహనాలకు రూ. 10 వేల వరకు పన్ను పడుతుంది. ఈ సెస్‌ను వాహన రిజిస్ట్రేషన్ సమయంలోనే వన్-టైమ్ పన్నుగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ప్రభుత్వానికి ఏటా సుమారు రూ. 300 కోట్ల వరకు అదనపు ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నారు. ఈ నిధులను కేవలం రోడ్డు భద్రత కోసమే వినియోగించాలని సుప్రీంకోర్టు మార్గదర్శకాలు ఉన్నాయి. దీని ద్వారా ప్రమాదకరమైన బ్లాక్ స్పాట్లను సరిచేయడం, ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించడం, అత్యవసర వైద్య సేవలను మెరుగుపరచడం వంటి పనులు చేపట్టనున్నారు.

గత వారం మల్కాజిగిరి కమిషనరేట్‌లో నమోదైన ఉల్లంఘనలు

ఉల్లంఘన : కేసుల సంఖ్య

రాంగ్‌సైడ్ డ్రైవింగ్ : 10,086

రోడ్లపై వాహనాల రాకపోకలకు అడ్డంకి : 8,178

సెల్‌ఫోన్ డ్రైవింగ్ : 1,015

ట్రిపుల్ రైడింగ్ : 1, 824

# చిన్న పొదుపు.. భారీ లాభం!

# రూ.45తో ప్రారంభించే LIC ప్లాన్


పెట్టుబడిలో భద్రతతో పాటు స్థిరమైన రాబడిని ఆశించే వారికి జీవిత బీమా పథకాలు ఇప్పటికీ నమ్మదగిన మార్గంగా భావించబడుతున్నాయి. ముఖ్యంగా Life Insurance Corporation of India (LIC) అందిస్తున్న 'Jeevan Anand' (ప్లాన్ నం. 915) ఇటీవల మళ్లీ చర్చనీయాంశమైంది. బీమా రక్షణతో పాటు పొదుపు ప్రయోజనాన్ని కలిపిన ఈ పాలసీ మధ్యతరగతి కుటుంబాలకు అనుకూలంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.ఈ పథకంలో ప్రీమియం మొత్తం కూడా సాధారణంగానే ఉంటుంది. ఉదాహరణకు, 35 ఏళ్ల వ్యక్తి రూ.5 లక్షల సమ్ అష్యూర్డ్‌తో 35 సంవత్సరాల పాలసీ తీసుకుంటే, సంవత్సరానికి సుమారు రూ.16,300 చెల్లించాల్సి ఉంటుంది. అంటే నెలకు దాదాపు రూ.1,400 లేదా రోజుకు సుమారు రూ.45—46 మాత్రమే. దీర్ఘకాలికంగా చూస్తే, ఈ చిన్న మొత్తంతో గణనీయమైన నిధిని సృష్టించుకునే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం అమల్లో ఉన్న బోనస్ అంచనాల ప్రకారం, పాలసీ మెచ్యూరిటీ సమయంలో సుమారు రూ.25 లక్షల వరకు లభించే అవకాశం ఉందని చెబుతున్నారు. ఇందులో రూ.5 లక్షల హామీ మొత్తం, దాదాపు రూ.8.60 లక్షల సింపుల్ రివిజనరీ బోనస్, సుమారు రూ.11.50 లక్షల తుది అదనపు బోనస్ ఉండవచ్చు. అయితే ఈ మొత్తాలు బోనస్ రేట్లపై ఆధారపడి మారవచ్చు.ఈ పథకంలో ముఖ్యమైన ఆకర్షణ 'హోల్ లైఫ్ కవర్'. చాలా పాలసీలు మెచ్యూరిటీతో ముగుస్తాయి. కానీ జీవన్ ఆనంద్‌లో మెచ్యూరిటీ తర్వాత కూడా రూ.5 లక్షల రిస్క్ కవర్ జీవితాంతం కొనసాగుతుంది. పాలసీదారు మరణించినప్పుడు నామినీకి ఈ హామీ మొత్తం చెల్లించబడుతుంది.పన్ను ప్రయోజనాలు ఈ పాలసీ కింద చెల్లించే ప్రీమియం ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80C కింద మినహాయింపుకు అర్హత పొందుతుంది. మెచ్యూరిటీ మొత్తం మరియు మరణ ప్రయోజనం సెక్షన్ 10(10D) ప్రకారం పన్ను రహితంగా ఉంటాయి (ప్రస్తుత నిబంధనల ప్రకారం). అదనంగా, రెండు సంవత్సరాల తర్వాత పాలసీపై రుణం పొందే సౌకర్యం కూడా ఉంది. తక్కువ ప్రీమియంతో బీమా రక్షణతో పాటు దీర్ఘకాలిక పొదుపు కోరుకునే వారికి ఈ పథకం సమతుల్య ఎంపికగా నిలుస్తోంది. అయితే, పాలసీ తీసుకునే ముందు వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలు, రాబడి అంచనాలు, ఇతర పెట్టుబడి మార్గాలను పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.






02 EVENING EDITION
సోమవారం | 02 మార్చి 2026
www.suryaa.com 4PM
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## అగ్రనేత మృతితో అట్టుడుకుతున్న ఇరాన్.. మసీదుపై 'ప్రతీకార ఎర్రజెండా'



మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో పరిస్థితి తీవ్రంగా మారింది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలోనే ఆయన మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఈ పరిణామంతో ఆగ్రహంతో రగిలిపోతున్న ఇరాన్, ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిన బూనుతూ క్వామ్ నగరంలోని పవిత్ర జామ్‌కరాన్ మసీదుపై 'ఎర్ర జెండా'ను ఎగురవేసింది. ఖమేనీ మరణంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు స్పందించారు. "చరిత్రలోనే అత్యంత క్రూరమైన వ్యక్తి అంతమయ్యాడు. ఇరాన్ ప్రజలు తమ దేశాన్ని తిరిగి చేజిక్కించుకోవడానికి ఇది గొప్ప అవకాశం" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. నెతన్యాహు కూడా ఖమేనీని ఒక నియంతగా అభివర్ణిస్తూ ఇరాన్ ప్రజలు తిరగబడాలని పిలుపునిచ్చారు. మరోవైపు, ఖమేనీ ఆకస్మిక మరణంతో దేశంలో రాజ్యాంగ సంక్షోభం తలెత్తకుండా ఇరాన్ ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టింది. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేంత వరకు పాలనను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన అత్యున్నత మండలిని ఏర్పాటు చేసింది. ఈ మండలిలో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, చీఫ్ జస్టిస్ ఎజీ, క్లారిక్ సభ్యుడు అలీరెజా అరాఫీ ఉన్నారు. షియా సంప్రదాయం ప్రకారం ఎర్ర జెండాను ఎగురవేయడం అంటే అన్యాయంగా చిందిన రక్తానికి ప్రతీకారం తీర్చుకుంటామని శపథం చేయడమే. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 40 రోజుల సంతాప దినాలు ప్రకటించిన సంగతి తెలిసిందే.

## 'ఆంధ్రప్రదేశ్ పేరు మార్చాలి': గరికపాటి



కేరళ రాష్ట్రం పేరు మార్చడానికి కేంద్ర కేబినెట్ ఇటీవలే ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. రాష్ట్రం పేరు మార్చే విషయమై కేరళ అసెంబ్లీ ఇప్పటికే పలు మార్లు తీర్మానాలు చేసింది. ఇటీవల రాష్ట్రం పేరు మార్చే తీర్మానానికి కేరళ అసెంబ్లీ ఆమోదం తెలపగా.. కేంద్ర కేబినెట్ కూడా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. కేరళ పేరును కేరళంగా మార్చనున్నారు. ఇప్పుడు ఇదే బాటలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరును కూడా మార్చాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు సైతం ఇదే డిమాండ్ చేశారు. ''కేరళ వాళ్లకు ఉన్న భాషాభిమానం, రాష్ట్రాభిమానం మనకు లేదు. ఇటీవల కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చారు. మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరును కూడా ఎన్టీఆర్ ఆశయానికి అనుగుణంగా తెలుగునాడు అని మార్చాలి. అప్పుడే మనకు జాతీయాభిమానం ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ అనేది తెలుగు మాట కాదు. నాకేం మొహమాటం లేదు చెప్పడానికి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్ ఎంతో ఆంధ్రప్రదేశ్ కూడా అంతే. మన రాష్ట్రం పేరును తమిళనాడు లాగే.. తెలుగునాడు అని మార్చాలి. ఒక సున్నా లేకపోతే కేరళ వాళ్లు ఇబ్బందయ్యింది. మా రాష్ట్రం, మా భాష.. మార్చాల్సిందే అనుకున్నారు. కేరళ పేరును కేరళంగా మార్చుకున్నారు. అటువంటి పట్టుదల మనలో వస్తే రాష్ట్రం పేరే కాదు మన బతుకులు కూడా మారతాయి'' అని గరికపాటి వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అమలాపురంలో నిర్వహిస్తున్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రసంగిస్తూ గరికపాటి ఈ వ్యాఖ్యలు చేశారు. మహర్షులు నిర్దేశించిన మార్గం నుంచి పక్కకు తప్పకోవడం మనం ఒత్తిడిలో జీవిస్తున్నామని గరికపాటి వ్యాఖ్యానించారు. తల్లి కడుపులో నుంచి బయటకొచ్చింది మొదలు చనిపోయేంత వరకు ప్రతి ఒక్కరూ ఆందోళనతోనే ఉంటున్నారన్నారని ఆయన తెలిపారు. ఆత్మసిద్ధి పొందడం కోసం ఒకటో తెలుగు వాచకంలోనే నాలుగు మాటలు పెట్టారన్నారు. ఐదో తరగతి వరకు తెలుగు మాధ్యమం తప్పనిసరి చేసినప్పుడు మాత్రమే తెలుగు భాష బతుకుతుందన్నారు. తన ఇద్దరు పిల్లలను తాను తెలుగు మీడియంలోనే చదివించానని ఆయన చెప్పారు. తెలుగు మాధ్యమం వల్ల ఎవరూ నష్టపోలేదని ఆయన అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు తెలుగు మాధ్యమంలోనే చదవాలని నిర్ణయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ సొంత దేశంలోనే ఉండాలని, ఇక్కడే పని చేయాలని అనుకుంటే భారతదేశం ఐదేళ్లలోనే విశ్వగురువుగా మారుతుందన్నారు. ఎన్టీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పేరు మార్చడానికి ప్రయత్నాలు చేశారు. ఆంధ్ర అనేది ఒక ప్రాంతాన్ని సూచిస్తుందని.. తెలుగు అనేది భాషాపరంగా అందర్నీ ఏకం చేస్తుందని ఆయన నమ్మారు. అందుకే రాష్ట్రం పేరు మార్చే విషయమై ఆయన అసెంబ్లీలో చర్చలు జరిపారు. కొందరు ఆయన ఆలోచనతో ఏకీభవించగా.. మరికొందరు మాత్రం ఆంధ్ర అనే చారిత్రక పేరును మార్చడం పట్ల అభ్యంతరాలు వ్యక్తం చేశారు. దీంతో ఆయన రాష్ట్రం పేరును మార్చలేకపోయారు.



హైదరాబాద్ రాజమండ్రి మధ్య తగ్గనున్న దూరం..

## త్వరలోనే ఆ ప్రాజెక్టు ప్రారంభం

రెండు తెలుగు రాష్ట్రాలను కలుపుతూ త్వరలోనే గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే అందుబాటులోకి రానుంది. ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాలను కలుపుతూ కేంద్ర ప్రభుత్వం నిర్మిస్తున్న NH 365-BG గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఈ విషయాన్ని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయ్యి వాహనదారులకు అందుబాటులోకి వస్తే హైదరాబాద్ రాజమండ్రి మధ్య దూరం తగ్గుతుందని పురందేశ్వరి ట్వీట్ చేశారు. ఖమ్మం—దేవరపల్లి మధ్య 162 కిలోమీటర్ల పొడవుతో, దాదాపు రూ. 4,609 కోట్ల వ్యయంతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకుంటున్నట్లు వెల్లడించారు. పచ్చని పొలాల మధ్యగా సాగే ఈ రహదారి ఇతర హైవేలకంటే ప్రత్యేకమని.. ప్రకృతిని ఆస్వాదిస్తూ ప్రయాణం సాగించవచ్చని పేర్కొన్నారు. ఈ హైవే పూర్తి అయితే, హైదరాబాద్ నుంచి విశాఖపట్నంకి వెళ్లేవారికి.. విజయవాడ మార్గం అవసరం లేకుండా, దూరం, సమయం రెండూ గణనీయంగా తగ్గుతాయని తెలిపారు. మరోవైపు ఖమ్మం - దేవరపల్లి మధ్య నాలుగు వరుసలుగా ఈ యాక్సెస్ కంట్రోల్డ్ గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతోంది.

## రేపు సింహాద్రి అప్పన్న పెళ్లిచూపుల వేడుక.. భక్తులకు దర్శనం బంద్



సింహగిరి శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి వార్షిక ఉత్సవాలకు తొలి అడుగు పడనుంది. ఫాల్గుణ పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 3వ తేదీన స్వామివారి డోలోత్సవం వైభవంగా జరగనుంది. అయితే, అదే రోజు చంద్రగ్రహణం కారణంగా రోజంతా భక్తులకు స్వామివారి దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) జె. వెంకటరావు స్పష్టం చేశారు. సంప్రదాయం ప్రకారం డోలోత్సవం రోజునే స్వామివారి సోదరి, అడివివరం గ్రామ దేవత అయిన శ్రీపైడితల్లి అమ్మవారి కుమార్తెతో అప్పన్న స్వామికి పెళ్లిచూపులు జరుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. స్వామివారి కల్యాణోత్సవానికి ముందు జరిగే ఈ వేడుక కోసం భక్తులు ఆసక్తిగా ఎదురుచూస్తుంటారు. ఈ ఉత్సవం కోసం తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారు దేవేరుల సమేతంగా పల్లకీలో కొండ దిగువన ఉన్న పుష్కరిణి ఉద్యాన మండపానికి తరలివస్తారు. అక్కడ స్వామివారిని ఉయ్యాలలో అధిష్ఠింపజేసి డోలోత్సవం నిర్వహిస్తారు. అనంతరం చూర్ణోత్సవం, వసంతోత్సవంలో భాగంగా ఆలయ సిబ్బంది, గ్రామస్థులు రంగులు చల్లుకుని సంబరాలు చేసుకుంటారు. ఉదయం 6 గంటలకు గ్రామ తిరువీధి జరుగుతుంది. మరోవైపు, 3న మధ్యాహ్నం 3:21 నుంచి సాయంత్రం 6:49 గంటల వరకు చంద్రగ్రహణం ఉంటుందని ఈవో తెలిపారు. ఈ కారణంగా ఆ రోజు ఆలయంలో భక్తుల దర్శనాలతో పాటు అన్ని ఆర్జిత సేవలను రద్దు చేసినట్లు ప్రకటించారు. ఉత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన వివరించారు.





## సైన్స్ ఎక్స్‌పో - 2026 విజయవంతంగా నిర్వహణ

2026 ఫిబ్రవరి 28వ తేదీన సైన్స్ ఎక్స్‌పో ఘనంగా మరియు విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత మరియు ఆవిష్కరణాత్మక ఆలోచనలను ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ ఎస్. శ్రీనివాస్ గారు (RPO Navy) హాజరై విద్యార్థులకు ప్రేరణాత్మక సందేశాన్ని అందించారు. శాస్త్ర విజ్ఞానం దేశ అభివృద్ధిలో ఎంతో ముఖ్యమని ఆయన తన ప్రసంగంలో తెలియజేశారు. అలాగే గౌరవ అతిథిగా డీన్ శ్రీ మధు కుమార్ గారు హాజరై విద్యార్థుల ప్రతిభను మరియు వారి కృషిని అభినందించారు. విద్యార్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, పర్యావరణ శాస్త్రం మరియు సాంకేతిక విజ్ఞానం వంటి విభాగాలలో అద్భుతమైన ప్రాజెక్టులు మరియు వర్కింగ్ మోడల్స్‌ను ప్రదర్శించారు. వారి ప్రదర్శనలు సృజనాత్మకత, జట్టు భావన మరియు ప్రాయోగిక జ్ఞానాన్ని ప్రతిబింబించాయి. మా గౌరవనీయ ప్రిన్సిపాల్ శ్రీమతి ఏ. కల్పనా గారు సభను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను తెలుసుకోవాలని, పరిశోధనాత్మక దృక్పథంతో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సైన్స్ ఎక్స్‌పో కార్యక్రమం అందరికీ ప్రేరణనిచ్చే విధంగా విజయవంతంగా ముగిసింది.



## రామ్ చరణ్ 'పెద్ది' డబ్బింగ్ పనులు ప్రారంభం

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తదుపరి చిత్రం 'పెద్ది'కి సంబంధించి కీలక అప్డేట్‌ను అభిమానులతో పంచుకున్నారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా డబ్బింగ్ పనులను రామ్ చరణ్ తాజాగా ప్రారంభించారు. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత చరణ్ నటిస్తున్న సోలో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. డబ్బింగ్ ప్రారంభించిన విషయాన్ని రామ్ చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. డబ్బింగ్ స్టూడియోలో దర్శకుడు బుచ్చిబాబుతో సరదాగా గడుపుతున్న 'బిహైండ్ ది సీన్స్' (బీటీఎస్) వీడియోను ఆయన పోస్ట్ చేశారు. ఈ వీడియోలో దర్శకుడిని రామ్ చరణ్ ఆటపట్టిస్తూ, నవ్విస్తూ కనిపించారు. "పెద్ది డబ్బింగ్ స్టార్ట్స్... వాట్ ఈజ్ ఇట్" అంటూ చరణ్ ఆసక్తికరమైన క్యాప్షన్ జోడించారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇటీవలే ఫిబ్రవరి 15న బుచ్చిబాబు పుట్టినరోజు సందర్భంగా చరణ్ సోషల్ మీడియాలో ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు.

## ఫార్ములా ఈ-కార్ రేస్ కేసు..

### ఐఏఎస్ అర్వింద్ కుమార్‌ను సస్పెండ్ చేసిన ప్రభుత్వం




తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫార్ములా ఈ-కార్ రేస్ వ్యవహారం ప్రస్తుతం తీవ్ర సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఆ ఫార్ములా ఈ-కార్ రేస్ నిర్వహణలో భారీగా అవకతవకలు జరిగాయని.. కోట్ల రూపాయలు చేతులు మారినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపిస్తోంది. ఇక ఈ ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు వేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక ఈ ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దర్యాప్తు చేస్తోంది. ఇక ఈ కేసులో ఐఏఎస్ అర్వింద్ కుమార్‌ను ప్రాసిక్యూషన్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా.. కొన్నిరోజుల క్రితమే అనుమతి లభించింది. ఈ క్రమంలోనే శాఖాపరమైన చర్యల్లో భాగంగా ఐఏఎస్ అర్వింద్ కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది. అర్వింద్ కుమార్ సస్పెన్షన్‌కు సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతకం కూడా చేసినట్లు సమాచారం. మరోవైపు.. ఈ ఫార్ములా ఈ-కార్ రేసు కేసులో మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్‌ను విచారణ చేసేందుకు కొన్ని నెలల క్రితమే గవర్నర్ అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపు.. ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని కూడా విచారణ జరిపేందుకు గతంలోనే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనుమతి మంజూరు చేశారు. అయితే ఇప్పటికే బీఎల్ఎన్ రెడ్డి పదవీ విరమణ చేశారు. ఇక ఈ కేసులో ఏసీబీ విచారణ పూర్తి అయ్యే వరకు అర్వింద్ కుమార్‌పై సస్పెన్షన్ వేటు కొనసాగనున్నట్లు తెలుస్తోంది. ఈ కేసులో ఇప్పటికే క్రిమినల్ కేసు నమోదు కాగా.. ఏసీబీ అధికారులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును దర్యాప్తు చేస్తున్నారు. ఇక ఇటీవలె 2 రోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో భారీగా ఐఏఎస్ బదిలీలు చేపట్టింది. ఒకేసారి 45 మందిని ట్రాన్స్‌ఫర్ చేసింది. ఈ బదిలీల్లో అర్వింద్ కుమార్‌కు.. ఏ బాధ్యతలు అప్పగించకుండా వెయిటింగ్‌లో ఉంచిన సర్కార్.. తాజాగా సస్పెండ్ చేసినట్లు తెలిపింది. ఈ విషయాన్ని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి కూడా తెలియచేసింది.



టెహ్రాన్‌లో ఉద్రిక్తత.. గాంధీ ఆసుపత్రిపై

## ఇజ్రాయెల్ దాడి!

ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నగరంలోని ప్రఖ్యాత గాంధీ ఆసుపత్రిపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు నిర్వహించింది. సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత ఇరు దేశాల మధ్య మొదలైన సైనిక చర్యల్లో భాగంగా ఈ దాడి జరిగింది. ఈ ఘటనతో ఆసుపత్రి భవనం ఒకవైపు తీవ్రంగా దెబ్బతినగా, లోపల ఉన్న రోగులు, సిబ్బంది ప్రాణభయంతో పరుగులు తీశారు. ఈ దాడికి సంబంధించిన భీతావహ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా, నవజాత శిశువుల వార్డు నుంచి నర్సులు పసిపిల్లలను ఎత్తుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న వీడియోలు అందరినీ కలచివేస్తున్నాయి. ఆసుపత్రి వార్డులన్నీ శిథిలాలు, గాజు పెంకులతో నిండిపోయాయి. వీల్ చైర్లు, వైద్య పరికరాలు ధ్వంసమై భయానక వాతావరణం నెలకొంది. కేవలం సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుంటున్నామని ఇజ్రాయెల్ సైన్యం చెబుతున్నప్పటికీ, ఆసుపత్రిపై దాడి జరగడం అంతర్జాతీయంగా విమర్శలకు దారితీస్తోంది. ఈ దాడికి ప్రతికారంగా ఇజ్రాయెల్‌లోని పలు నగరాలపై క్షిపణి దాడులు చేసేందుకు ఇరాన్ కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం టెహ్రాన్ గగనతలం దట్టమైన నల్లటి పొగతో నిండిపోయి, యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది.



## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం వేళ తెరపైకి హైదరాబాద్ చారిత్రక బంధం

ఇజ్రాయెల్, అమెరికాతో ఇరాన్ యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో హైదరాబాద్ వాసులు ఆ దేశంతో తమకున్న శతాబ్దాల అనుబంధాన్ని గుర్తుచేసుకుంటున్నారు. భాగ్యనగర రూపశిల్పి మొదలుకొని, నగరాన్ని నిర్మించిన పాలకులు కూడా నాటి పర్షియా నుంచి వచ్చినవారే కావడంతో ఈ చారిత్రక బంధంపై మరోసారి ఆసక్తి నెలకొంది.హైదరాబాద్ నగరాన్ని 1591లో నిర్మించిన మహమ్మద్ కులీకుతుబ్ షా కొలువులో ప్రధానిగా పనిచేసిన మీర్ మోమిన్ అస్త్రాబాదీ ఇరాన్‌కు చెందినవారే. ఆయన పర్యవేక్షణలోనే హైదరాబాద్ నగరం అద్భుతమైన కట్టడాలు, ఉద్యానవనాలతో రూపుదిద్దుకుంది. ఈ కారణంగానే గోల్కొండ కోట, చార్మినార్, కుతుబ్‌షాహీల సమాధుల వంటి అనేక వారసత్వ కట్టడాల్లో పర్షియన్ వాస్తు శైలి నేటికీ ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. కుతుబ్‌షాహీలు, ఆ తర్వాత పాలించిన నిజాంలు కూడా ఇరాన్ నుంచి వలస వచ్చినవారే.ఈ బంధం కేవలం కట్టడాలకే పరిమితం కాలేదు. మనం ఇష్టంగా తినే బిర్యానీ, హలీం, తాగే ఇరానీ చాయ్ వంటివి పర్షియా నుంచి వచ్చినవే. 20వ శతాబ్దంలో ఇక్కడికి వలస వచ్చిన ఇరానీయులు ఏర్పాటు చేసిన కేఫ్‌లు నగర సంస్కృతిలో భాగమయ్యాయి.

## మహారాష్ట్రలో 17 మంది సజీవ దహనం

మైనింగ్-పారిశ్రామిక పేలుడు పదార్థాలు తయారు చేసే ఫ్యాక్టరీలో పేలుడు సంభవించి 17 మంది సజీవ దహనమయ్యారు. గుర్తుపట్టడానికి వీలులేని విధంగా మృతదేహాలు కాలిపోవడంతో మృతుల గుర్తింపు కోసం కుటుంబసభ్యుల నుంచి డీఎన్ఏ శాంపిళ్లను అధికారులు సేకరిస్తున్నారు. ఘటనలో మరో 18 మందికి గాయాలయ్యాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లా కాటో ల్ మండలం రావుల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్‌లో ఆదివా రం ఉదయం ఈ పేలుడు సంభవించింది. ఘటన స్థలంలో ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్‌తోపాటు పీఈఎస్‌వో(పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోజివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్), డీఐఎస్ఎస్(డిఫెన్స్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ సెక్యూరిటీ) బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు నిర్వహిస్తున్నాయని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ తెలిపారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి, వైద్యం అందిస్తున్నామన్నారు. స్థానిక అధికారుల నుంచి ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటున్నామని వెల్లడించారు. కాగా, కంపెనీకి చెందిన ప్యాకింగ్ యూనిట్‌లో ఉదయం 7 గంటల నుంచి 7.15 గంటల మధ్యలో ఈ పేలుడు సంభవించిందని ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. 'ఆ సమయంలో పేలు డు పదార్థాల తయారీ ప్రక్రియలేమీ జరగడం లేదు. పేలుడుకు కారణం ఏమిటనేదానిపై దర్యాప్తు కొనసాగుతోంది. సంబంధిత అధికారులకు పూర్తి స్థాయిలో సహకరిస్తున్నాం' అని పేర్కొంది.